నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కొండాపూర్, మే 29 : విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులతో కొత్తగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొమ్మల తొలగింపుతో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్న 12:30 గంటల వరకు రాఘవేంద్రకాలనీ ఏ, బీ బ్లాక్‌లలో, మధ్యాహ్నం 2 గంటల నుంచి 3:30 గంటల వరకు రాజరాజేశ్వరీనగర్ కాలనీలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స కోసం వచ్చి.. మహిళ అదృశ్యం

రేణుక(ఫైల్)

దుండిగల్,మే 29:మానసిక రుగ్మతతో బాధపడుతున్న ఓ మహిళ చికిత్స కోసం నగరానికి వచ్చి, నగర శివారు ప్రాంతంలో అదృశ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా, చిలవేయుల మండలం, గుంపుల గ్రామానికి చెందిన కోలయాదమ్మ, మల్లయ్య దంపతుల కుమార్తె కళారేణుక(36) గత కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నది. యాదమ్మ ఈ నేపథ్యంలో కళారేణుకను ఎర్రగడ్డలోని మానసిక చికిత్సాలయంలో చేర్పించేందుకు ఈనెల 27న తమ గ్రామం నుంచి సికింద్రాబాద్‌కు బస్సులో సాయంత్రం 6:30 గంటల సమయంలో తీసుకువచ్చింది. అక్కడి నుంచి దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, గండిమైసమ్మలో ఉంటున్న తమ చిన్నకుమార్తె ఇంటికి ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. అయితే బస్సు బహదూర్‌పల్లి వరకే రావడంతో అక్కడ దిగి ఆటో కోసం ఎదురుచూస్తుండగా.. అక్కడి నుంచి రేణుక కనిపించకుండా వెళ్లిపోయింది. యాదమ్మ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం చూపాలి

ఎమ్మెల్యే గాంధీ

ట్రాఫిక్ సమస్యలపై కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, మే 29: నానాటికీ పెరుగుతున్న ట్రాఫిక్ నేపథ్యంలో ఎటువంటి సమస్యలు రాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ట్రాఫిక్ నరకయాతన నుంచి వాహనదారులకు, ప్రజలకు ఉపశమనం కల్పించాలన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని విజయనగర్ కాలనీ, నవోదయ కాలనీల్లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై ట్రాఫిక్ విభాగం అధికారులతో పాటు కాలనీ వాసులతో కలిసి ఎమ్మెల్యే గాంధీ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాల రాకపోకలు సులువుగా సాగేలా అవసరమైన చోట డివైడర్లను ఏర్పాటు చేయాలని, దారి మళ్లింపును చేపట్టాలని, రహదారులు దాటే ప్రాంతంలో తప్పకుండా తగు బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధానంగా ఉదయం, సాయంత్ర వేళల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటున్నందున సిబ్బంది క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి నియంత్రించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వాహనాలను ఇతర వ్యాపారాలపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. ప్రజలకు సులువైన సుఖ ప్రదమైన రవాణా సౌకర్యాన్ని అభివృద్ధిపరిచేలా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రమేశ్, బీఆర్ఎస్ నేతలు కాశీనాథ్ యాదవ్, సత్యనారాయణ, నవీన్, స్వరూప, లావణ్య కాలనీవాసులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి



సీఎం సహాయనిధి మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, మే 29 : నిరుపేదలకు అండగా సీఎం సహాయ నిధి నిలుస్తున్నదని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. పేద రికంతో ఏ ఒక్కరికీ వైద్యం భారం కాకుండా ఉండేందుకు ఈ పథకం సాయం ఎంతో తోడ్పాటునిస్తుందన్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఖాజాగూడ బస్తీకి చెందిన దినకర్‌కు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి కింద రూ. 2.30 లక్షల ఆర్థిక సాయం నిధుల మంజూరు పత్రాన్ని కార్పొరేటర్లు మాధవరం రోజాదేవి, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో ఎమ్మెల్యే గాంధీ బుధవారం తన నివాసంలో బాధిత కుటుంబానికి అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలకు తోడు పేదరింలో ఉన్న నిరుపేదలు ఉచితంగా కార్పొరేట్ వైద్యం పొందేందుకు సీఎం సహాయ నిధి సాయం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బాధిత కుటుంబాలకు వీలైనంత త్వరగా సహాయం అందేలా సంబంధిత విభాగాలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ నేతలు రంగారావు, గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, హరినాథ్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నరక యాతన నుంచి రక్షించండి

ఆందోళనకు దిగిన వివిధ కాలనీల ప్రజలు

ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న మల్లంపేట్ పరిసర కాలనీల ప్రజలు

దుండిగల్,మే 29 : నిత్యం ట్రాఫిక్‌తో నరకయాతన పడుతున్నామని, తమకు ట్రాఫిక్ సమస్య నుంచి విముక్తి కల్పించాలని దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్, పరిసర ప్రాంతాలు, కాలనీలకు చెందిన ప్రజలు బుధవారం రోడ్డు ఎక్కారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సమస్య నుంచి తమను రక్షించాలంటూ ప్లకార్డులను చేతబూని నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లి చౌరస్తా నుంచి మల్లంపేట రింగ్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ లేకపోవడంతో ప్రతిరోజు ట్రాఫిక్ స్తంభించిపోతుందని, ఫలితంగా గంటల తరబడి రోడ్డుపై వేచి ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని రోడ్డు గుంతలు పడి ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని వాపోయారు. మల్లంపేట్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా ఐటీ ఎంప్లాయీస్ నివసిస్తున్నారని, వారు హైటెక్ సిటీకి వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారని, నిత్యం తీవ్రమైన ట్రాఫిక్‌తో సమయానికి కార్యాలయాలకు చేరుకోలేకపోతున్నామని ఏకరువుపెట్టారు. ఈ విషయంలో ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవని, అందుకే రోడ్డెక్కాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. రోడ్డుపై కంకరపోసి మూడు నెలలవుతున్నా నిర్మాణం చేయడంలేదని, దీంతో తీవ్రమైన దుమ్ముతో ప్రయాణికులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. వర్షాకాలంలో సరైన డ్రైనేజీ వ్యవస్థలేక రోడ్డుపై వెళ్తున్న వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. సుమారు గంటసేపు నిరసన తెలుపడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కల్గింది.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు అవగాహన కల్పిస్తున్న మేడ్చల్ జోన్ డీసీపీ నర్సింహా రెడ్డి, ఏసీపీ రాములు, సీఐ విజయ్‌వర్ధన్

కుత్బుల్లాపూర్, మే 29: జూలై మొదటి నుంచి ప్రభుత్వం పోలీస్‌శాఖలో తీసుకొస్తున్న కొత్త చట్టాలపై ప్రతి ఒక్క పోలీస్ బాధ్యతతో అవగాహన కలిగి ఉండాలని మేడ్చల్ జోన్ అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి సూచించారు. బుధవారం పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో 38 మంది పోలీస్ అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. పలు అంశాలపై కులంకుషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పేట్ బషీరాబాద్ డివిజన్ ఏసీపీ రాములు, ఎస్‌హెచ్‌ఓ విజయ్‌వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్ర హోమం

యజ్ఞహోమాలతో శాంతి సౌభాగ్యాలు కలుగుతాయని శృంగేరి శంకరమఠం మోతీనగర్ శాఖ కార్యనిర్వహణ అధికారి సీఎస్‌ఆర్ మూర్తి పేర్కొన్నారు. శంకరమఠం వార్షికోత్సవంలో భాగంగా బుధవారం శ్రీలలితాహోమం నిర్వహించారు. ఈ వేడుకలు రేపటితో ముగియనున్నాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. – అల్లాపూర్, మే 29

బాధిత కుటుంబానికి సరుకుల పంపిణీ

అనారోగ్యంతో బాధపడుతున్న రేణుక కుటుంబానికి ఆకాంక్ష ఫౌండేషన్ ఆపన్న హస్తాన్ని అందించింది. జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పలో నివసిస్తున్న రేణుక కొద్దికాలంగా అనారోగ్యంలో బాధపడుతుండగా.. ఆ కుటుంబానికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు సీహెచ్‌వీ.రామారావు, సభ్యులు నవీన్ రామోజీ, అనిల్, యాకయ్య, చంద్ర తదితరులు ఉన్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, మే 29

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

ఇద్దరికి తీవ్రగాయాలు

శేరిలింగంపల్లి, మే 29 : నిర్లక్ష్యంగా కారు నడిపి సిగ్నల్ వద్ద ఆగకుండా దూసుకెళ్లి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... రాయదుర్గం ప్రాంతానికి చెందిన కొడారి సత్యనారాయణ, కొడారి కాంతారావులు బుధవారం తెల్లవారుజామున 6:30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై రాయదుర్గం నుంచి జేఆర్‌సీ కన్వెన్షన్ వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో రాయదుర్గం మైఫిల్ జంక్షన్ ట్రాఫిక్ సిగ్నల్ ప్రాంతంలో గచ్చిబౌలి వైపు నుంచి షేక్‌పేట నారాయణమ్మ కళాశాల వైపు వెళ్తున్న కారు నిర్లక్ష్యంగా రెడ్‌సిగ్నల్ జంప్‌చేసి దూసుకు వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న కొడారి సత్యనారాయణ, కొడారి కాంతారావులకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నానాకనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. కాగా ప్రమాదానికి కారణమైన కారు నడిపిన వ్యక్తి మణికొండ ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సుధీర్‌రెడ్డిగా పోలీసులు గుర్తించారు. సుధీర్‌రెడ్డి తన స్నేహితులు రవితేజ, రోహిత్ రెడ్డిలతో కలిసి కారులో వెళ్తూ నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో ఈ ప్రమాదం జరిగిందని, తాగిన మైకంలో సుధీర్‌రెడ్డి కారును నడిపినట్లు గుర్తించారు. సుధీర్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని బాధితుల ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కారులో ప్రయాణిస్తున్న రవితేజ, రోహిత్‌రెడ్డిలు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులపై కేసు

పోలీసుల అదుపులో హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు

దుండిగల్, మే 29 : సమయాపాలన పాటించకుండా శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా అర్ధరాత్రి కార్యకలాపాలు సాగిస్తున్న పలు రెస్టారెంట్లు, హోటళ్లు, టీ దుకాణాల నిర్వాహకులపై బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. బాచుపల్లి పీఎస్ పరిధిలోని గ్రీన్‌బావర్చీ హోటల్, మోమో రెస్టారెంట్, బ్లూబెల్ రెస్టారెంట్, ఐబాకో ఐస్‌క్రీమ్ పార్లర్‌తో పాటు పలు టీ దుకాణాలు, పాన్‌షాపు యజమానులపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు. మొత్తం 9 మంది హోటళ్ల నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వరకు రెస్టారెంట్లు, హోటల్స్ తెరిచి ఉంచకూడదని పేర్కొన్నారు.

జేకే శేఖర్‌యాదవ్‌కు అభినందనలు

కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌గా నూతనంగా నియమితులైన బీజేపీ రాష్ట్ర నాయకులు జేకే శేఖర్‌యాదవ్‌ను ఆ పార్టీ నేతలు పలుపురు అభినందించారు. బుధవారం బీజేపీ జిల్లా నాయకులు దేవర రమేశ్, శేఖర్‌యాదవ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా విభాగం కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ అంగిడి మల్లేశ్, సీనియర్ నాయకులు జగన్మోహన్‌రెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు. – దుండిగల్, మే 29

అక్రమ నిర్మాణాల కూల్చివేత

ఖాజగూడ పెద్దచెరువు బఫర్‌జోన్‌లో, దుండిగల్‌లో వెలిసిన అక్రమ నిర్మాణాలను జేసీబీతో కూల్చి వేయిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

శేరిలింగంపల్లి, మే 29 : శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని ఖాజగూడ పెద్దచెరువు బఫర్‌జోన్‌లో వెలసిన అక్రమ నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ అధికారులు బుధవారం కూల్చివేశారు. వెస్ట్‌జోన్ కమిషనర్ స్నేహా శబరీష్ ఆదేశాల మేరకు పెద్ద చెరువు బఫర్‌జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ప్రీకాస్ట్ ప్రహరీతోపాటు ఓ గదిని జేసీబీ సాయంతో కూల్చివేతలు చేపట్టారు. విలువైన చెరువు స్థలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా జోనల్ కమీషనర్ హెచ్చరించారు.

దుండిగల్‌లో...

దుండిగల్, మే 29: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బాచుపల్లి మండలం, నిజాంపేట్ రెవెన్యూ పరిధి, ప్రభుత్వ అసైన్డ్‌స్థలాల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు బుధవారం కూల్చివేశారు. సర్వే నంబర్ 334, డబుల్ బెడ్‌రూం ఇండ్ల వద్ద నిర్మించిన రెండు గదులు, 4బేసిమెంట్లను నేలమట్టం చేశారు. అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ, అసైన్డ్ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేదలకు ఇవ్వకుండా ప్రైవేట్ యూనివర్సిటీకి ఎలా ఇస్తారు..

కుత్బుల్లాపూర్ రెవెన్యూ కార్యాలయం వద్ద వినతి పత్రాలతో సీపీఐ నేతలు

దుండిగల్, మే 29 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్ సర్వే నంబర్ 34లో ఉన్న 5 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమిని కేఎల్ యూనివర్సిటీకి ఎలా కేటాయిస్తారంటూ సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి ఉమామహేశ్ అన్నారు. ఇందుకు సంబంధించి బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక ఎమ్మార్వో లేకపోవడంతో ఇన్వార్డులో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేశ్ మాట్లాడుతూ.. పేద ప్రజలు ఇండ్లు లేని వారికి 60 గజాల స్థలం ఇవ్వమంటే ప్రజలను అరెస్టు చేయించే అధికారులు, కోట్లాది రూపాయల వ్యాపారం చేసే వారికి స్థలం కేటాయించడం దుర్మార్గమని, అలాంటి నిర్ణయం తీసుకుంటే వెంటనే ఉపసంహరించుకోవాలని వినతిపత్రంలో తెలియజేశారు. ఒకవేళ అధికారులకు, ప్రభుత్వానికి, కబ్జాదారులకు డబ్బులు కావాలంటే ఇండ్లు లేనివారి దగ్గర వసూలు చేసి ఇస్తామని 60 గజాల స్థలం కేటాయించాలని కోరారు. లేనిపక్షంలో మరోసారి భూపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు హరినాథ్‌రావ్, శ్రీనివాస్, రాములు, శాఖ నాయకులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి ఒకరి మృతి

వాచ్‌మన్‌పై కేసు నమోదు

దుండిగల్, మే 29 :నిర్మాణంలో ఉన్న ఓ బహుళ అంతస్తుల భవనం మొదటి అంతస్తు పైనుంచి కిందపడి ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్‌పల్లికి చెందిన ఎన్.నర్సింగరావు అనే వ్యక్తికి డీ.పోచంపల్లిలోని, గండిమైసమ్మ, గణేశ్‌నగర్‌లోని సర్వే నంబర్ 166/1పార్టు-6లో బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తున్నాడు. ఇందులో మోత్కూరి నర్సింహ అనే వ్యక్తి వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మూడో అంతస్తుకు సంబంధించిన సెంట్రింగ్ పనులు నడుస్తుండగా.. మద్యం మత్తులో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి(45) మొదటి అంతస్తుపైకి ఎక్కి అక్కడి నుంచి కిందపడి మృతి చెందాడు. గమనించిన వాచ్‌మన్ అతడిని బయటకు ఈడ్చుకువచ్చి రోడ్డుపక్కన పడుకోబెట్టి తన యజమానికి సమాచారం అందించాడు. భవన యజమాని నర్సింగరావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, శవాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. అయితే మృతుడు రోడ్డు పక్కనే చనిపోయాడని తప్పుడు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వాచ్‌మన్‌పై కేసు నమోదు చేశారు.

ఆకట్టుకున్న సూత్ర ఫ్యాషన్ ఎగ్జిబిషన్

మాదాపూర్, మే 29: సంప్రదాయ మేళవింపు కలిగిన సూత్ర ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో కొలువుదీరింది. ముఖ్యఅతిథిగా నటి రీతూ చౌదరి విచ్చేసి నిర్వాహకుడు ఉమేశ్ మద్యాన్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. దేశంలోని ప్రముఖ నగరాల నుంచి మహిళా వ్యాపారవేత్తలు, డిజైనర్‌ల చేతులమీదుగా రూపొందించిన పలు రకాల ఉత్పత్తులను ప్రదర్శించారు. వీటిని చూసేందుకు నగరవాసులు పెద్ద ఎత్తున బారులు తీశారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

బీఆర్ఎస్ శ్రేణులతో సమావేశమైన కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ

దుండిగల్,మే 29 : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు శంభీపూర్‌కృష్ణను శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని వారు కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా నెలకొన్న ప్రతి సమస్యలను దశలవారీగా శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నేతలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చేయూత అభినందనీయం

జగద్గిరిగుట్ట, మే 29: అనారోగ్యంతో ఉన్న పేదలకు సాయం చేయడం అభినందనీయమని పలువురు అన్నారు. జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పకు చెందిన రాధిక అనే మహిళ నిర్ధారణ కాని వ్యాధితో బాధపడుతున్నది. ఆర్థికంగా అంతంత మాత్రమే కావడంతో చేయూత కోసం ఎదురుచూస్తున్నది. విప్లవజ్యోతి అల్లూరి ఫౌండేషన ప్రతినిధులు బుధవారం ఆమెకు నెలకు సరిపడా నిత్యావసర సరకులు, వీల్‌చైర్, నగదు అందజేశారు. ఈమెను ఆదుకునేందుకు ప్రభుత్వం, దాతలు ముందుకు రావాలని కోరారు. రాధిక ఫోన్‌పే నంబర్ :8885601920కు ఆర్థిక సాయం అందించవచ్చని తెలిపారు. జంగాతాతాజీ, చింత కిందినాగరాజు, నర్సింహ, సంతోష్, సూర్య, రవి పాల్గొన్నారు.